మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 162 | శుక్రవారం | 05 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4


## విశాఖలో పోలీస్ ఆరోగ్య బీమా పథకం ప్రారంభం



2 లో..



- రాష్ట్ర అభివృద్ధి దిశగా భారీ పెట్టుబడుల చర్చ
- పలు రంగాల్లో పెట్టుబడులకు బోర్డు ఆమోదం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## రూ.20 వేల కోట్ల ప్రతిపాదనలకు


# ఆమోదం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల పెరుగుదల దిశలో మరో కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నేడు సచివాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపిబి) 13వ సమావేశం జరిగింది. మొత్తం 26 కంపెనీల నుంచి వచ్చిన రూ. 20 వేల కోట్ల మేర పెట్టుబడుల ప్రతిపాదనలు ఈ సమావేశంలో ప్రధాన అంశంగా చర్చకు వచ్చాయి. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల ప్రవాహం పెరగడం



ద్వారా ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణలకు దిశ నిర్దేశం అవుతుందనే అభిప్రా యం వ్యక్తమైంది. సమావేశంలో ఎనర్జీ, ఐటీ, ఐ అండ్ ఐ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ రంగాల్లో పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు భావిస్తు న్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వాతావరణం విస్తరణ, నూతన టెక్నాలజీల ప్రవేశం, విస్తృత ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఈ నిర్ణయాలు ఉపకరిస్తాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పెట్టుబడులను ఆకర్షించడానికి అవసరమైన అనుమతులు, సబ్సిడీలు, విధాన పరమైన మద్దతు త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం చురుకైన అడుగులు వేసే అవకా శం ఉంది. సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, కందుల

2 లో..



## భారత్‌కు చేరుకున్న రష్యా

# అధ్యక్షుడు

- ప్రధాని మోదీ ఘన స్వాగతం
- రెండు రోజుల పర్యటనకు ఢిల్లీకి వచ్చిన పుతిన్
- భారత్-రష్యా శిఖరాగ్ర సమావేశంలో కీలక ఒప్పందాలు

మన గళం, న్యూఢిల్లీ : భారత్-రష్యా సంబంధాల్లో కీలక మలుపుగా భావిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం నేడు ఢిల్లీకి చేరుకున్నారు. పాలం ఎయిర్‌పోర్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్వాగతం పలకడం, ఆత్మీయ ఆలింగనం పంచుకోవడం ఈ పర్యటన ప్రాముఖ్యతను ప్రతిబింబించింది. విమానాశ్రయంలో కళాకారుల సాంప్రదాయ నృత్యాలతో పుతిన్‌కు ఘన స్వాగతం పలికారు. భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పుతిన్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య అణు విద్యుత్, ఇంధనం, పరిశ్రమలు, సంస్కృతి, వ్యవసాయం వంటి రంగాల్లో కీలక ఒప్పందాలు కుదిరే

2 లో..

## భారత్-రష్యా ఆర్థిక భాగస్వామ్యంలో

# కొత్త అవకాశాలు



- భారత్-రష్యా వ్యాపార వేదికలో పియూష్ గోయల్ ప్రసంగం
- వ్యూహాత్మక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలపై దృష్టి
- పారిశ్రామిక రంగాల్లో సహకారం ఆర్థిక వృద్ధికి దోహదం

మన గళం, న్యూఢిల్లీ : భారత్-రష్యా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంపై లక్ష్యంగా నేడు న్యూ ఢిల్లీలో భారత మంత్రి పియూష్ గోయల్ ప్రసంగం చేశారు. భరత్ మండపం వేదికగా జరిగిన భారత్-రష్యా వ్యాపార వేదికలో రష్యా అధ్యక్ష కార్యాలయ ఉప ముఖ్య అధికారి మాక్సిమ్ ఒరెష్కిన్‌తో కలిసి పాల్గొన్న గోయల్, ఇరు దేశాల ఆర్థిక భాగస్వామ్యం "ప్రత్యేకం మరియు ప్రాధాన్యభరితం" అని పేర్కొన్నారు. విస్తరిస్తున్న సహకార రంగాలు, పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు లాభదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరు

2 లో..

## వాల్మీకి భవన్‌కు స్థలం కేటాయించండి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : వాల్మీకి భవన్ కు స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌ను ఏపీ వాల్మీక బోయ కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, తోళ్ల మంజునాథ్ కోరారు. ఈ మేరకు గురువారం ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, ఏపీ శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ సుబ్బయ్య, ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పీ విజయ్ కుమార్ తో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. వాల్మీకులు చర్చించుకునేందుకు ఓ భవనం అవసరమని, స్థలం కేటాయించాలని వారు కలెక్టర్, జేసీని కోరారు.

## ప్రజలకు గ్రామ

# పాలన మరింత చేరువ


- డీడీఓ కార్యాలయాల ప్రారంభం - రాష్ట్రవ్యాప్తంగా 77 శాఖలు కార్యకలాపాలు ప్రారంభం



మన గళం, చిత్తూరు : ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థకు నూతన రూపం తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం పెద్ద అడుగు వేసింది. చిత్తూరు నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకేసారి 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసు (డీడీఓ) కార్యాలయాలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ప్రజలకు చేరువగా, వేగవంతంగా సేవలు అందిం చడమే కాకుండా, గ్రామీణ పాలనను పారదర్శ కంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయాలు వారధిగా పని చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలు మంత్రులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 70% గ్రామాలే ఉన్నాయని, గ్రామ ప్రజలకు పాలనా సేవలు సులభంగా అందించేందుకు డీడీఓ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గాంధీజీ ఆలో చనలకు అనుగుణంగా గ్రామాలను పట్టుకొ మ్మలుగా తీర్చిదిద్దడం లక్ష్యమని, చిన్న సమస్యలు కూడా స్థానికంగా పరిష్కారం పొందే విధంగా వ్యవస్థను మార్చుతు న్నామని వివరించారు. డీడీఓ కార్యాలయాల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలు నిరం తర పర్యవేక్షణలో ఉంటాయని, అధికారులు ప్రజలతో మమేకం కావ డానికి ఇది ఉపకరించనుందని పేర్కొన్నారు.

2 లో..

## భారత్ భద్రతా వ్యవస్థకు కొత్త సవాల్?



భారత-చైనా సరిహద్దులో 'స్పై రోబో' కలకలం

మన గళం, న్యూఢిల్లీ : భారత్-చైనా సరిహద్దులో ఒక స్పై రోబో కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎల్ఏసీ సమీపంలోని ఎత్తైన ప్రాంతంలో కనిపించిన ఆ రోబో చైనాకు చెందినదిగా భావిస్తున్నారు. ఇది చైనా భద్రతా వ్యవస్థ నిఘా కోసం ప్రత్యేకంగా మోహరించిందని అను మానాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధాలు ఎప్పుడూ సైనికులు,

2 లో..

## కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ను కలిసిన డైరెక్టర్లు



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ను గురువారం ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, ఏపీ వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్లు మురళీనాయుడు, తోళ్ల మంజునాథ్, ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, ఏపీ శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ సుబ్బయ్య, ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పీ విజయ్ కుమార్ మర్యాద పూర్వకం గా కలిశారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యారంగా సమస్యలపై డైరెక్టర్లు కలెక్టర్, జేసీతో చర్చించారు. మౌలిక వసతులు, బోధన తదితర విషయాలపై చర్చించారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


## భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు

అవకాశం ఉంది. పుతిన్ గౌరవార్థం ప్రధాని మోదీ గురువారం రాత్రి విందు ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం అనంతరం ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, భారత్–రష్యా ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. దాదాపు ఒక దశాబ్దం తరువాత, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంతో భద్రతా అంశాలు, ప్రపంచ రాజకీయ పరిస్థితులపై కూడా ఇరు దేశ నేతలు చర్చించే అవకాశముంది భారత్ –రష్యా ద్వైపాక్షిక వాణిజ్యంలో ఉన్న సమతుల్యత లోటును తగ్గించేందుకు భారత్ ప్రయత్నాలు చేపట్టింది. ఔషధాలు, ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు వంటి రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. దీంతో భారత ఉత్పత్తులకు భారీ మార్కెట్ లభించడమే కాకుండా, దేశీయ పరిశ్రమలు, రైతులకు లాభదాయక పరిస్థితులు సృష్టించబడతాయి. రష్యా అధ్యక్షుడితో పాటు పలు వ్యాపార ప్రతినిధులు కూడా వచ్చారు. షిప్పింగ్, ఆరోగ్య పరిరక్షణ, ఎరువులు, టెక్నాలజీ, రవాణా రంగాల్లో ఒప్పందాలు, అవగాహన పత్రాలు కుదిరే అవకాశాలు ఉన్నాయి. అదనంగా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడి, శాస్త్రీయ పరిశోధన, నైపుణ్య అభివృద్ధి రంగాల్లో కొత్త భాగస్వామ్యాలు ఏర్పడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటనతో భారత్–రష్యా సంబంధాలు రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో మరింత బలపడతాయని, ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## భారత్-రష్యా ఆర్థిక భాగస్వామ్యంలో కొత్త అవకాశాలు




దేశాల వ్యాపార వర్గాలు ఉపయోగించని అవకాశాలను గుర్తించాలని గోయల్ సూచించారు. ప్రత్యేకించి భారీ పెట్టుబడులకు అవకాశం ఉన్న కొన్ని రంగాల్లో సహకారం విస్తరిస్తే, పరస్పర ప్రయోజనాలు అందే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న పారిశ్రామిక శక్తి, స్టార్టప్ పర్యావరణం, కొత్త టెక్నాలజీల ఆవిర్భావం ప్రపంచ పెట్టుబడిదారులకు ఆకర్షణీయమని వివరించారు. ఈ సహకారం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడమే కాకుండా, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుందని గోయల్ వ్యాఖ్యానించారు. భారత్–రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యం గత కొన్ని సంవత్సరాల్లో అనేక రంగాల్లో బలపడింది. రక్షణ, శక్తి, వ్యాపార, టెక్నాలజీ వంటి విభాగాల్లో ఇరు దేశాలు ముందడుగు వేస్తున్నాయి. గోయల్ ప్రసంగంలో ప్రత్యేకంగా పెట్టుబడుల ప్రవాహం, పరిశ్రమల సామర్థ్య విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించారు. కొత్త రంగాల్లో సహకారం పెంపు, వ్యాపార వాతావరణం సౌలభ్యం, పెట్టుబడిదారులకు భరోసా కల్పించడం వంటి చర్యలు రెండు దేశాలకూ లాభదాయకమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత లోతుగా మార్చడానికి, నూతన రంగాల్లో భాగస్వామ్యం విస్తరిస్తే భవిష్యత్తులో పెద్ద అవకాశాలు ఉన్నాయని ఈ సమావేశం దృష్టికి తీసుకువచ్చింది. భారత పారిశ్రామిక వ్యవస్థలో ఉన్న సామర్థ్యం, రష్యా మార్కెట్ అవకాశాలతో కలిసి, ద్వైపాక్షిక ప్రగతికి బలమైన పునాది వేయగలదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్ భద్రతా వ్యవస్థకు కొత్త సవాల్?

ఆయుధాలు, క్షిపణులతో జరిగేవి. కానీ ప్రస్తుతం డ్రోన్లు, రోబోట్లు, ఆటోనమస్ వ్యవస్థలు ఆధారంగా యుద్ధాలు సాగుతున్నాయి. భవిష్యత్తులో “మనుషులు వర్సెస్ రోబోలు” యుద్ధాలు జరిగే అవకాశం ఉందన్న సంకేతాలు ఈ ఘటనతో మరింత బలం పొందుతున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో హ్యూమనాయిడ్ ఆకారంలో ఉన్న రోబో ఎత్తైన ప్రాంతంలో నిలబడి ఉన్నట్లు కనిపిస్తోంది. దీనిని సరిహద్దుల్లో నిఘా పనుల కోసం స్పై రోబోగా చైనా ఉపయోగిస్తోందని కొంతమంది చెబుతున్నారు. రోబో చలనాలు, కెమెరా వ్యవస్థలు, సెన్సార్లు భద్రతా దళాల కదలికలను ట్రాక్ చేయవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా ఇప్పటికే అత్యాధునిక డ్రోన్లు, ఆటోనమస్ వాహనాలు, రోబోటిక్ పరికరాలను ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ రోబో కూడా అదే వ్యూహంలో భాగమై ఉండవచ్చని నిపుణుల అభిప్రాయం. ఇప్పటికే చైనా సైన్యం టెక్నాలజీ ఆధారిత యుద్ధ సామర్థ్యాన్ని విస్తృతం చేయడానికి భారీగా పెట్టుబడులు పెట్టింది. దాని ప్రభావం సరిహద్దుల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఈ వీడియోలు సూచిస్తున్నాయి. ఈ రోబోకు సంబంధించిన అధికారిక సమాచారం బయటకు రానప్పటికీ, దాని విజువల్స్ భారత భద్రతా వ్యవస్థలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రతా వ్యూహాల అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, వస్తున్న కాలంలో సరిహద్దు రక్షణలో యుద్ధ టెక్నాలజీ కీలక పాత్ర పోషించబోతోంది, అందుకు భారత్ కూడా తగిన విధంగా సిద్ధమవాల్సిన అవసరం ఉంది.

# రూ.20 వేల కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం

దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పెట్టుబడులపై సమగ్ర సమీక్ష, ప్రాజెక్టుల సామర్థ్యం, ఆర్థిక ప్రభావం వంటి అంశాలపై ఈ సమావేశంలో లోతైన చర్చలు జరిగాయి. పెట్టుబడులకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి, శ్రమ నైపుణ్యాల పెంపు, వ్యాపార వాతావరణ సౌలభ్యం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుంటుందని సమాచారం. ఈ సమావేశానికి మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. పెట్టుబడులు ఆకర్షించడంలో సామాజిక, పర్యావరణ పరిరక్షణ, పారదర్శక విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయ రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలు, విధానాలు ఈ సమావేశంతో మరింత క్లారిటీని సాధించినట్లు కనిపిస్తోంది.

# ప్రజలకు గ్రామ పాలన మరింత చేరువ

పదోన్నతుల అంశం పంచాయతీరాజ్ శాఖలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు. గత కొన్ని నెలల్లో 10 వేల మందికి ఏ రాజకీయ ప్రభావం లేకుండా, ప్రమాణాల ప్రకారం పదోన్నతులు కల్పించామన్నారు. వి.ఏ.ఒ., ఎం.పి.డి.ఒ. స్థాయిలో నిలిచిపోయిన సమస్యలను పరిష్కరించేందుకు పరిపాలనా సంస్కరణలు అమలు చేసినట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో ఆర్.డి.ఒ. స్థాయి అధికారిని నియమించి సేవల విస్తరణకు అవకాశమిచ్చామని వివరించారు. పంచాయతీలను స్వయంపాలన సంస్థలుగా బలోపేతం చేయడం ఈ సంస్కరణల ప్రాథమిక లక్ష్యంగా పేర్కొన్నారు. 7,244 క్లస్టర్లను రద్దు చేసి, 13,350 గ్రామ పంచాయతీలుగా మలచడం ద్వారా అభివృద్ధి నిర్ణయాలు స్థానికంగా తీసుకునే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా ఐటి వింగ్, ప్లానింగ్ వింగ్, వాటర్ సప్లయ్, స్ట్రీట్ లైటింగ్ వంటి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం ద్వారా సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి రానున్నాయి.




కార్యాలయాల ప్రారంభోత్సవంపై పలువురు మంత్రులు స్పందించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు దీన్ని “విప్లవాత్మక నిర్ణయం”గా పేర్కొంటే, మంత్రి నాదెండ్ల మనోహర్ “సంస్కరణలు అందిపుచ్చుకోవాలి” అన్నారు. ఆనం రాంనారాయణ రెడ్డి, కింజరపు అచ్చెన్నాయుడు, సవిత వంటి మంత్రులు ఈ చర్య పంచాయతీరాజ్ సిబ్బందికి ఉత్తేజాన్ని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. చిత్తూరు పర్యటనలో ఉప ముఖ్యమంత్రి ప్రజల వినతులు స్వీకరించారు. విమానాశ్రయం వద్ద ప్రజలు నేరుగా సమస్యలు తెలిపిన సందర్భంగా, తక్షణ స్పందనతో అధికారులకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో వేగంగా అమలయ్యేలా డీడీఓ కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ భాగస్వామ్యంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికినట్లు భావిస్తున్న ఈ నిర్ణయం, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# విశాఖలో పోలీస్ ఆరోగ్య బీమా పథకం ప్రారంభం






**- ప్రజల రక్షకుల ఆరోగ్య భద్రత మా బాధ్యత" : మంత్రి అనిత - పోలీస్ సిబ్బందికి ఆరోగ్య బీమా బాండ్ల పంపిణీ**

మన గళం, విశాఖపట్నం : ప్రజా రక్షణ కోసం అహర్నిశలు పనిచేసే పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ ఆరోగ్య బీమా పథకాన్ని రాష్ట్ర మంత్రి అనిత వంగలపూడి ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సమక్షంలో ఈ పథకానికి సంబంధించిన బాండ్లను పోలీసులు అందుకున్నారు. ఈ సంక్షేమ కార్యక్రమం ద్వారా పోలీసుల ఆరోగ్య రక్షణకు అవసరమైన భరోసా కల్పించడమే లక్ష్యమని మంత్రి అనిత తెలిపారు. పోలీసులు ప్రజల కోసం 24 గంటలూ శ్రమిస్తూ, ప్రమాదాల మధ్య జీవితం సాగిస్తారని, వారి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. అనారోగ్య సమయంలో చికిత్స, వైద్య ఖర్చుల భారం కుటుంబాలపై పడకుండా ఆరోగ్య బీమా సహాయపడుతుందని పేర్కొన్నారు. సమాజ శాంతి కాపాడే వారి కృషికి ప్రతిఫలంగా ఈ పథకం సేవ చేయనుందని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. బీమా పథకం అమలు, అర్హతల వివరాలు, ప్రయోజనాలు వంటి అంశాలను అధికారులకు వివరించగా, పోలీసులు ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విజయవాడ పోలీసులు, హోంసెక్యూరిటీ సిబ్బంది, ట్రాఫిక్ విభాగం వంటి విభాగాలకు కూడా ఈ పథకం అందుబాటులోకి రావచ్చని సమాచారం. రాష్ట్రంలో పోలీస్ సంక్షేమ కార్యక్రమాలను విస్తరించే దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు సూచించాయి.

# భవానిపురం కూల్చివేత దారుణం

మన గళం, విజయవాడ : విజయవాడ భవానిపురంలో 42 ఇండ్లను కూల్చివేసిన ఘటన రాజకీయంగా తీవ్ర ప్రతికూలతను రేకెత్తిస్తోంది. సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ ఇళ్లను కూల్చడం ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు చర్య అని వైఎస్ శర్మిల తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యలో మానవతా దృష్టికోణం పూర్తిగా లేకపోయిందని, ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను కనికరం లేకుండా రోడ్డున పడేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్న బాధిత కుటుంబాలు ఒక్కసారిగా నిలువ నీడ కోల్పోయిన పరిస్థితి ఆందోళనకరమని శర్మిల పేర్కొన్నారు. “పళంగా కట్టుబట్టలతో బయటికి తోసేయడం, చిన్నపిల్లలు, వృద్ధులు బాధపడుతున్న దృశ్యం చూస్తే హృదయం బరువెక్కుతుంది” అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మొహం చాటేశారని ఆమె ఆరోపించారు. సమస్యను వివరించేందుకు బాధితులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లినా, అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని శర్మిల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను విని పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, బాధితుల్ని నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ఆమె చెప్పారు.

భవానిపురం సమస్యపై కాంగ్రెస్ తరఫున స్పందిస్తున్నామన్న శర్మిల, ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బాధితులను పిలిచి మాట్లాడాలని, వారి బాధను అర్థం చేసుకోవాలని, న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన వివాదానికి పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. ఇంటి కోల్పోయిన



కుటుంబాలకు తక్షణ నివాస సదుపాయాలు, పరిహారం, పునర్వసతి వంటి అంశాలను ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలించాలని శర్మిల డిమాండ్ చేశారు. బాధితుల ఆవేదనను అడ్డగోలుగా వదిలేస్తే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని ఆమె హెచ్చరించారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంతకాల సేకరణ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర పరిధిలోని 36, 37, 41 వార్డులకు సంబంధించి ఎల్లమ్మ గుడి నుండి వాసు హోటల్ చర్చి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వీకర్ సెక్షన్ కాలనీలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ కేవీపీఎస్ న్యూసిటీ కమిటీ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. కేవీపీఎస్ నాయకులు జమ్మన్న అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో నగర కార్యదర్శి యం.భాస్కర్, నాయకులు సత్యం, జానీ మాట్లాడారు. 25వేల నుండి 30 వేల మంది జనాభా నివసిస్తున్న ఒక పెద్ద ఏరియాలో రోడ్డు మొత్తం పాడైపోయి రోజు అనేకమంది కిందపడి ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా స్మశాన వాటిక స్థలము లేక ఎక్కడో ఉన్న కల్లూరు జమ్మి చెట్టు ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల, పెన్షన్ల సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.కార్యక్రమంలో కెవిపిఎస్ వార్డు నాయకులు శేఖర్, గుర్రప్ప రహీమన్ మహేష్ కిరణ్ పాల్గొన్నారు.

## సాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



మనగళం, కర్నూలు సిటీ : త్రిమూర్తుల (బ్రాహ్మ, విష్ణు, మహేశ్వరుల) స్వరూపంగా, ఆది గురువుగా పూజలు అందుకునే దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరు అర్బన్ 32వ వార్డులోని అశ్వర్థ నారాయణ సాయి బాబా మందిరంలో వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి, మిడుతూరు శ్రీనివాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అపర చాణక్యుడు కొనిజేటి రోశయ్య



మనగళం, కర్నూలు సిటీ : దివంగత ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య అపర చాణక్యుడు అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ మెంబర్ ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానీ బాషా పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం రోశయ్య నాలుగవ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రిగా 15 సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఘనత రోషయ్యకే దక్కుతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సునాయాసంగా గట్టెక్కించిన మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, మైనార్టీ సెల్ సెక్రెటరీ వసిబాషా, నాయకులు, బి సుబ్రహ్మణ్యం, సత్యరాజు, మాలిక్ బాషా, కేశవ రెడ్డి, అతిఫ్ ఆలీఖాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ - షేర్‌మార్కెట్ పోటీ పెరిగింది..

హైదరాబాద్, డిసెంబర్ 4:మనగళం: పెట్టుబడి ప్రపంచంలో రియల్ ఎస్టేట్, షేర్‌మార్కెట్ అనే రెండు మార్గాలు ఎప్పటి నుంచీ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయి. తమ డబ్బు వేగంగా పెరగాలని, స్థిరమైన లాభాలు రావాలని ఆశించే వారు ఈ రెండు రంగాల మధ్య పోలిక చేస్తూ ముందుకు సాగుతుంటారు. తాజా పరిస్థితులు, గణాంకాలు చూస్తే గత ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగం పెట్టుబడిదారులకు ఊహించిన దానికంటే మెరుగైన రాబడిని అందించి షేర్‌మార్కెట్‌ను మించి దూసుకెళ్లింది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో గృహ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత ఒక సంవత్సరంలో సగటున 15 శాతం లాభాన్ని ఇచ్చింది. ఇదే సమయంలో నిఫ్టీ సూచీ మాత్రం 3 శాతం వరకూ పడిపోయింది. సెప్టెంబర్ 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు రియల్ ఎస్టేట్ రాబడులను ఫైనాన్స్ హౌసింగ్ టోటల్ రిటర్న్ సూచీ పరిశీలించగా.. ఆ సూచీ విలువ 228 నుంచి 263కి పెరిగినట్లు వెల్లడించింది. అంటే పెట్టుబడి పెట్టిన వారికి 15 శాతం కంటే ఎక్కువ వరకూ శుద్ధ లాభాలు వచ్చినట్లు స్పష్టమైంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం దేశంలోని మహా నగరాల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి. రహదారులు, అంతర్రాష్ట్ర లింకులు, మెట్రో మార్గాలు, వంతెనలు వేగంగా నిర్మాణం పొందడంతో నగరాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది. ఈ కనెక్టివిటీ కొత్త ప్రాంతాలకు గృహ డిమాండ్‌ను పెంచగా, ధరలు సహజంగానే పెరిగాయి. నగరాలు తమ వాణిజ్య విస్తరణను పెంచుతున్నందున, ఉద్యోగ అవకాశాలు, ఐటీ పార్కులు, పరిశ్రమా విస్తరణల వల్ల సమీప ప్రాంతాల్లో గృహాలపై డిమాండ్ మరింత అధికమైంది. ఈ దృష్ట్యా రాబోయే సంవత్సరాల్లో రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడే అవకాశమున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం





మనగళం, కర్నూలు కలెక్టరేట్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని, పాలనా సౌలభ్యం కోసం గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం చిత్తూరు నుండి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ లో ఏర్పాటు చేసిన నూతన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలు ఎన్నో ఉంటాయని, వాటి పరిష్కారం కోసం జిల్లా ప్రధాన కార్యాలయం కాకుండా డివిజన్ స్థాయిలోనే పరిష్కరించే విధంగా ఈ కార్యాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో కర్నూలు, పత్తికొండ ,ఆదోని డివిజన్ అభివృద్ధి కార్యాలయాల ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యలను డివిజనల్ అభివృద్ధి అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకొని ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించే సౌలభ్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థకు సర్వాధికారాలు : కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పంచాయితీ రాజ్ శాఖ కు సర్వాధికారాలు వచ్చాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రం లో ఉన్న 13,226 పంచాయతీ ల్లో ఒకే రోజు గ్రామ సభలు పెట్టి వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు తీర్మానాలు చేయడం రికార్డు అని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సభలో వచ్చిన తీర్మానాలను దశల వారీగా ప్రభుత్వం తీరుస్తూ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. గ్రామంలో డ్రైనేజ్, తాగునీరు, రోడ్డు అవసరమో వాటికి నిధులు కేటాయించి పనులు చేయడం జరుగుతోందన్నారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ఏర్పాటు వల్ల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారం చేయటానికి అనుకూలత ఉంటుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.గ్రామీణ అభివృద్ధి బలోపేతానికి ప్రభుత్వం కృషి : పంచాయతీ రాజ్ వ్యవస్థ, గ్రామీణ అభివృద్ధి బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. గ్రామీణ స్థాయిలో సీసీ రోడ్లు, తాగునీరు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, డిపిఓ భాస్కర్, డి ఎల్ డి వో రమణారెడ్డి,డ్వామా పిడి వెంకట రమణయ్య, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ ను విస్తృతంగా ప్రచారం చేయాలి

**- కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు సిటీ : పీఎమ్ సూర్య ఘర్ పథకంలో భాగంగా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ మీద జీఎస్టీ 18 శాతం నుండి 5 శాతానికి తగ్గింపుపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో పీఎం సూర్య ఘర్ కి సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ పథకం కింద 2026-2027 ఆర్థిక సంవత్సరం నాటికి భారతదేశం అంతటా కోటి గృహాలకు పైకప్పు సౌర వ్యవస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగ జిల్లాలో లక్ష గృహాలకు పైకప్పు సౌర వ్యవస్థలను ఏర్పాటు చేసే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ జిల్లా పరిషత్ సీఈవో, డిఆర్డిఏ, మెప్మా పిడి లను, డిపిఓ లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ లు ఇస్తోందని, ఈ అంశంపై శ్రద్ధ వహించి సోలార్ ప్యానెల్ లను ఇన్స్టాల్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రూ.70 వేల విలువ చేసే 1 కిలో వాట్ సోలార్ ప్యానెల్ కొని ఇన్స్టాల్ చేసుకుంటే రూ.30 వేలు సబ్సిడీ వస్తుందని, రూ.1.40 లక్షల విలువ చేసే 2 కిలో వాట్స్ సోలార్ ప్యానెల్ కొని ఇన్స్టాల్ చేసుకుంటే, రూ.60 వేలు సబ్సిడీ వస్తుందని, రూ. 2.10 లక్షలవిలువ చేసే 3 కిలో వాట్స్ సోలార్ ప్యానెల్ కొని ఇన్స్టాల్ చేసుకుంటే, రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. అదే విధంగా వీటి పైన జీఎస్టీ కూడా 18 శాతం నుండి 5 శాతం వచ్చినందుకు యూనిట్ కాస్ట్ మరింత తక్కువకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటివరకు 92 వేల 469 మంది రిజిస్టర్ అయ్యారని, ఎస్సీ, ఎస్టీ కింద 81 వేల 591 మంది ఇతరులు 10 వేల 878 మంది రిజిస్టర్ అయ్యారన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ లకు సంబంధించిన 23 వేల 77 మంది గృహాలకు రూఫ్ టాప్ సోలార్ లను మార్చి నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వివరించారు. అలాగే మోడల్ సోలార్ గ్రామాల కింద నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 6 గ్రామ పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో పెద్దహరివాణం గ్రామంలో ఎక్కువ సంఖ్యలో 5 రూఫ్ టాప్ సోలార్ లను ఏర్పాటు చేసినందుకు గాను సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద అంగన్వాడి సెంటర్లలో, వైద్యశాలల్లో, పాఠశాలల్లో సోలార్ స్ట్రీట్ లైట్ లు, తాగు నీటి ఏర్పాటు కొరకు కోటి రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని ఎస్ ఈ కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఎల్ డి ఎం రామచంద్ర రావు, డి ఆర్ డి ఏ పిడి రమణా రెడ్డి, మెప్మా పిడి శ్రీనివాసులు, నెడ్ క్యాప్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార సముదాయాల సీజ్







మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై అధికారుల కొరడా కొనసాగుతోంది. రెండో రోజు గురువారం కిడ్స్ వరల్డ్ సమీపంలోని నేషనల్ టీ స్టాల్, స్వీట్ షాపునకు సంబంధించి రూ.6.58 లక్షలు, రాత్రి స్టేట్ గీతాంజలి నర్సింగ్ కాలేజీకి సంబంధించి రూ.5.53 లక్షల బకాయలు ఉండటంతో సదరు రెండు వ్యాపార సముదాయాలను సీజ్ చేశారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మొండి బకాయిదారుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ 6 సంవత్సరాలకు పైగా ఆస్తి పన్ను చెల్లించకపోతే ఆర్.ఆర్. యాక్ట్ ప్రకారం ఆస్తి జప్తునకు కోర్టు నందు చార్జీషిట్ దాఖలు చేయడం జరుగుతుందన్నారు. రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, కార్పొరేషన్‌కి ఆర్థిక నష్టం కలిగించే విధంగా బకాయిదారులు వ్యవహరించవద్దని సూచించారు. యజమానులు అందుబాటులో లేకపోతే అద్దెదారులకే నోటిసులు జారీ చేస్తామని, అద్దెదారులు అద్దెలో మినహాయింపు ఇచ్చుకోవాలని సూచించారు. త్వరలో టాప్ - 100 మొండి బకాయిదారుల వివరాలు ప్రధాన కూడళ్లలో బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిల కోసం లేఖలు రాయడం జరుగుతుందని, త్వరలో శాఖ అధికారులను కలుస్తామని చెప్పారు. నగర ప్రజలకు కేఎంసి సిటిజన్ ఫ్రెండ్లీగా ఉంటుందని, అధిక పన్ను బకాయిదారులను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. ఏవైనా ఆస్తి పన్ను ఎక్కువగా ఉంటే విస్తీరణం, పొరపాట్లు ఉంటే సరిచేస్తామని, అంతేతప్ప ఏళ్ళ తరబడి పెండింగ్లో ఉంటే ఏమీ చేయలేమన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ జునైద్, ఆర్ఐలు రాజు, శ్రీకాంత్, భార్గవ్, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : దత్తజయంతిని సందర్భంగా ఈ రోజు (04.12.2025) లోకకల్యాణంకోసం దేవస్థానం ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద వేంచేబు చేసిఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. కాగా ప్రతి గురువారం కూడా దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ రోజు దత్తజయంతి కారణంగా ఈ విశేషపూజలు జరిపించబడ్డాయి. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు కాగా శ్రీశైలక్షేత్రానికి దత్రాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి తాము యిక మీదట అదృశ్యరూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను



మనగళం శ్రీశైలం : ఈ రోజు (04.12.2025) ఉదయానికి పౌర్ణమి ఘడియలు రావడంతో శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. కాగా లక్షకుంకుమార్చన తరువాత ఈ ఊయలసేవ జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చన జరిపించబడుతాయి. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## శ్రీశైల మల్లికార్జున స్వామికి పల్లకీ సేవ



మనగళం శ్రీశైలం : ఈ రోజు (04.12.2025 ) ఉదయానికి పౌర్ణమి ఘడియలు రావడంతో శ్రీ స్వామిఅమ్మ వార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించనున్నది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో (సర్కారి సేవగా) జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడుతాయి.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (04.12.2025) కమలేక్షిని నిత్య విద్యాలయము, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో మహాగణపతిం, మూషికవాహన, శివశివ శంకరా, ఆనందతాండవం, తాండవ నృత్యం, శంభో శివశంభో , ఓం నమశ్శివాయ తదితర గీతాలకు లక్ష్మి, ఉజ్జ్వల, వెన్నెల, రత్న, ధరణి, సాహితీ, సత్య, ప్రణిత, నిఖిల, దివ్య తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## అధికారం శాశ్వతం కాదు!

- దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే సహించం
- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని





మనగళం, నంద్యాల : టీడీపీ నాయకులు కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హెచ్చరించారు. దుండగుల దాడిలో గాయపడి నంద్యాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ హరినాథ్ రెడ్డి కాటసానితోపాటు నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా తదితరులు పరామర్శించారు. దాడికి సంబంధించిన వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ కూటమి సర్కార్ పెద్దలు మాయమాటలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరును ప్రజలు సైతం వ్యతిరేకిస్తున్నారని, వైసీపీ చేసిన మేలును గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. అయితే ఓర్వలేక కొందరు టీడీపీ నాయకులు ఉనికిని చాటుకునేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తమ ఓపికను చేతకాని తనం అనుకుంటే పొరపాటని, ఇప్పటకైనా ఇలాంటి చర్యలకు స్వస్తి చెప్పాలని, లేని పక్షంలో ఫలితం చవిచూస్తారని హెచ్చరించారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయించండి







మనగళం, నంద్యాల : గవర్నమెంట్ అస్యూరెన్సెస్‌కు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటీ చైర్మన్ ఇసాక్ బాషా అధికారులను సూచించారు. గురువారం నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటీ చైర్మన్, సభ్యులు, సంబంధిత విభాగాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ కమిటీ సభ్యులు కావూరు శ్రీనివాస్, ఎం.వి. రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, దేవాదాయ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెజిస్లేటివ్ కౌన్సిల్ కమిటీ చైర్మన్ ఇసాక్ బాషా తెలుగు ప్రాజెక్ట్‌లో భాగమైన వెలుగోడు రిజర్వాయర్ పురోగతి, గతంలో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందనే అంశాలపై సమగ్రంగా చర్చించారు. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో షాదీ ఖానాల నిర్మాణం, దుల్హన్ స్కీం ప్రయోజనాల పెంపు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు, ప్రస్తుతం రూ.1 లక్షకు పెంచిన తర్వాత అర్హులకు నిధుల విడుదల ఎలా జరుగుతోంది, ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రపోజల్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గాలేరి%-%నగరి సుజల స్రవంతి, హంద్రీ%-%నీవా సుజల స్రవంతి పథకాల్లో శాంక్షన్లు, పురోగతి, మిగిలి ఉన్న పనులపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న దేవాలయాలు, కండిషన్స్‌లో ఉన్న దేవాలయాల పునర్నిర్మాణం, కొత్తపల్లి మరియు కొలువుభారతి వద్ద ఉన్న సరస్వతి దేవాలయాల అభివృద్ధి పనులు, రుద్రకోడూరు ఆలయ స్థితి వివరాలు అడిగి తెలుసుకుంటూ ఎండోమెంట్స్ శాఖ ఈ పనులకు రూ.2.70 కోట్లు మంజూరు చేసినట్లు, వాటి అమలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అందుతున్న నిధుల వినియోగంపై, ఒంటిమిట్ట దేవాలయం అభివృద్ధి అంశంపైనా చర్చించడం జరిగిందని చెప్పారు. అన్ని విభాగాల నుంచి సమగ్ర నివేదికలు సేకరించి కౌన్సిల్‌కు పంపించి, పూర్తయిన హామీలను కౌన్సిల్‌లో క్లియర్ చేసే చర్యలు చేపడతామని చైర్మన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దేవాదాయ శాఖ పరిధిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మున్సిపల్ విభాగానికి సంబంధించి స్లాటెడ్ హౌసింగ్ కోసం అవసరమైన పట్టణాల్లో స్థలాల గుర్తింపు, పాడైపోయిన నిర్మాణాల మరమ్మతులు, కొత్త స్లాటెడ్ హౌసెస్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖలో వన్ లాక్ స్కీం అమలు కోసం మార్గదర్శకాలు వచ్చిన వెంటనే జిల్లాలో అమలు కార్యక్రమాలు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వాటర్ రిసోర్సెస్ విభాగంలో పెండింగ్ పనుల వివరాలు ప్రభుత్వంతో పంచుకుని త్వరితగతిన పూర్తి చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## శ్రీశైల గిరిప్రదక్షిణ

మనగళం శ్రీశైలం : ఈ రోజు ( 04.12.2025) ఉదయానికి పౌర్ణమి ఘడియలు రావడంతో దేవస్థానం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నది. ఈ రోజు సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఈ గిరిప్రదక్షిణ ప్రారంభవుతుంది. ఆలయ మహాద్వారం నుండి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుండి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంటుంది. అక్కడి నుండి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు చేరుకుంటుంది. హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్ధిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగుస్తుంది. శ్రీశైలక్షేత్రములోని ప్రాచీనమఠాలను, ఆలయాలను భక్తులచేత దర్శింపజేయిస్తూ వారిలో భక్తిభావాలను మరింతగా పెంపొందింపజేయాలని, అదేవిధంగా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదక్షిణను నిర్వహించడం జరుగుతోంది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ప్రదక్షిణానంతరం శ్రీస్వామివార్లదర్శనం కల్పించబడుతోంయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## అంతర్జాతీయ వాలంటీర్ డే: సేవా భావంతో సమాజ మార్పు

- సేవా స్ఫూర్తి, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం
- వాలంటీర్ల సహకారంతో సమాజానికి అండ
- ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల్లో వాలంటీరిజం అవసరం
- యువతలో సామాజిక బాధ్యత పెంపు

ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 5న జరుపుకునే అంతర్జాతీయ వాలంటీర్ డే అనేది కేవలం ఒక సాంప్రదాయ దినోత్సవం కాదు, మానవత్వం, ప్రేమ, బాధ్యత, సానుభూతి వంటి విలువలను నిలబెట్టే మహత్తర ఉద్యమం. సమాజంలో మార్పు రావాలంటే ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలు మాత్రమే కాదుబీ ప్రజల్లో బాధ్యత, సేవా భావన, పరస్పర సహకారం కూడా సమాన కీలకం. ఈ లక్ష్యంతో పనిచేసే వాలంటీర్లు దేశ అభివృద్ధి, సమాజ శ్రేయస్సుకు శక్తివంతమైన బలస్తంభాలుగా నిలుస్తున్నారు.

ప్రపంచంలోని చాలా దేశాల్లో విద్య, ఆరోగ్యం, పర్యావరణం, విపత్తు నిర్వహణ, మానవ హక్కులు మరియు పేదరిక నిర్మూలన రంగాల్లో వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం అందని ప్రాంతాల్లో, విపత్తు పరిస్థితుల్లో, సామాజిక ప్రతిస్పందన అగత్యంగా ఉన్న సందర్భాల్లో, వేలాది వాలంటీర్లు ముందుకు వచ్చి సేవలందించడం గమనించదగిన విషయం. ఇండియాలో కూడా ఎన్జీవోలు, యువజన సంస్థలు, కళాశాల విద్యార్థులు, సామాజిక సేవా సంఘాలు ఈ రంగంలో చురుకుగా సేవలందిస్తున్నారు. మనం తరచూ వార్తల్లో చూసే రక్తదానం, ఆహార పంపిణీ, రక్షణ చర్యలు, విద్యా సహాయం వంటి కార్యక్రమాల వెనుక వేలాది మంది నిస్వార్థ సేవకులు ఉన్నారు. ఇటీవలి కాలంలో వాలంటీర్ల పాత్ర మరింత విస్తరించింది. సాంకేతికత, సోషల్ మీడియా, యువతలో పెరుగుతున్న సామాజిక స్పృహ కారణంగా వాలంటీరిజం ఒక 'మార్పు శక్తిగా' అవతరించింది. పర్యావరణ సంరక్షణ, ప్లాస్టిక్ నిరోధం, ఫుడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మహిళా సురక్ష, మానసిక ఆరోగ్యం వంటి కొత్త రంగాల్లో కూడా వాలంటీర్లు విజయవంతమైన ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా పలు ప్రాంతాల్లో వాలంటీర్ కార్యక్రమాలను అధికారిక పాలసీల్లో భాగం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. యువతే దేశ భవిష్యత్తని తరచూ చెప్పే మాట, కానీ అది కేవలం ఉద్యోగాలు, అవకాశాలు కల్పించడంలోనే కాకుండా, సామాజిక బాధ్యతతో జీవించే పౌరులుగా తీర్చిదిద్దడంలోనే అసలైన లక్ష్యం. వాలంటీరిజం ద్వారా యువతలో నాయకత్వం, కలసికట్టుగా పనిచేయడం, సమస్యల పరిష్కారం, సామాజిక అవగాహన, మానవత్వం వంటి విలువలు పెంపొందుతాయి. సమాజం మంచి దిశగా మారాలంటే రాజకీయాలు, ప్రభుత్వాలు మాత్రమే కాదుబీ ప్రతి పౌరుడు చిన్నపాటి ప్రయత్నం చేయాలి. ఒకరికొకరు అండగా నిలబడటం, అవసరంలో సహాయం చేయడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీస్తాయని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది.

సారాంశంగా, అంతర్జాతీయ వాలంటీర్ డే అనేది 'సేవ చేయడానికి సమయం దొరికితే చేస్తాను' అనే భావన కాదని, 'సమాజానికి సేవ చేయడం మన బాధ్యత' అనే తత్వాన్ని ప్రతిపాదిస్తుంది. లాభం, వ్యక్తిగత ప్రయోజనం, గుర్తింపు లేకుండా జరిగే సేవే నిజమైన మహోన్నత సేవ. మన దేశంలో సామాజిక అసమానతలు, పేదరికం, విద్య మరియు ఆరోగ్య సమస్యలు ఇంకా ఉన్న నేపథ్యంలో, వాలంటీర్ల పాత్ర మరింత కీలకం. ప్రతి ఒక్కరూ "నేను ఏమి చేయగలను?" అని విచారించే రోజే మార్పు ప్రారంభమవుతుంది.ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 5న జరుపుకునే అంతర్జాతీయ వాలంటీర్ డే అనేది కేవలం ఒక సాంప్రదాయ దినోత్సవం కాదు, మానవత్వం, ప్రేమ, బాధ్యత, సానుభూతి వంటి విలువలను నిలబెట్టే మహత్తర ఉద్యమం. సమాజంలో మార్పు రావాలంటే ప్రభుత్వ కార్యక్రమాలు, విధానాలు మాత్రమే కాదుబీ ప్రజల్లో బాధ్యత, సేవా భావన, పరస్పర సహకారం కూడా సమాన కీలకం. ఈ లక్ష్యంతో పనిచేసే వాలంటీర్లు దేశ అభివృద్ధి, సమాజ శ్రేయస్సుకు శక్తివంతమైన బలస్తంభాలుగా నిలుస్తున్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో విద్య, ఆరోగ్యం, పర్యావరణం, విపత్తు నిర్వహణ, మానవ హక్కులు మరియు పేదరిక నిర్మూలన రంగాల్లో వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ సహాయం అందని ప్రాంతాల్లో, విపత్తు పరిస్థితుల్లో, సామాజిక ప్రతిస్పందన అగత్యంగా ఉన్న సందర్భాల్లో, వేలాది వాలంటీర్లు ముందుకు వచ్చి సేవలందించడం గమనించదగిన విషయం. ఇండియాలో కూడా ఎన్జీవోలు, యువజన సంస్థలు, కళాశాల విద్యార్థులు, సామాజిక సేవా సంఘాలు ఈ రంగంలో చురుకుగా సేవలందిస్తున్నారు. మనం తరచూ వార్తల్లో చూసే రక్తదానం, ఆహార పంపిణీ, రక్షణ చర్యలు, విద్యా సహాయం వంటి కార్యక్రమాల వెనుక వేలాది మంది నిస్వార్థ సేవకులు ఉన్నారు. ఇటీవలి కాలంలో వాలంటీర్ల పాత్ర మరింత విస్తరించింది. సాంకేతికత, సోషల్ మీడియా, యువతలో పెరుగుతున్న సామాజిక స్పృహ కారణంగా వాలంటీరిజం ఒక 'మార్పు శక్తిగా' అవతరించింది. పర్యావరణ సంరక్షణ, ప్లాస్టిక్ నిరోధం, ఫుడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మహిళా సురక్ష, మానసిక ఆరోగ్యం వంటి కొత్త రంగాల్లో కూడా వాలంటీర్లు విజయవంతమైన ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా పలు ప్రాంతాల్లో వాలంటీర్ కార్యక్రమాలను అధికారిక పాలసీల్లో భాగం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. యువతే దేశ భవిష్యత్తని తరచూ చెప్పే మాట, కానీ అది కేవలం ఉద్యోగాలు, అవకాశాలు కల్పించడంలోనే కాకుండా, సామాజిక బాధ్యతతో జీవించే పౌరులుగా తీర్చిదిద్దడంలోనే అసలైన లక్ష్యం. వాలంటీరిజం ద్వారా యువతలో నాయకత్వం, కలసికట్టుగా పనిచేయడం, సమస్యల పరిష్కారం, సామాజిక అవగాహన, మానవత్వం వంటి విలువలు పెంపొందుతాయి. సమాజం మంచి దిశగా మారాలంటే రాజకీయాలు, ప్రభుత్వాలు మాత్రమే కాదుబీ ప్రతి పౌరుడు చిన్నపాటి ప్రయత్నం చేయాలి. ఒకరికొకరు అండగా నిలబడటం, అవసరంలో సహాయం చేయడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీస్తాయని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది.

సారాంశంగా, అంతర్జాతీయ వాలంటీర్ డే అనేది 'సేవ చేయడానికి సమయం దొరికితే చేస్తాను' అనే భావన కాదని, 'సమాజానికి సేవ చేయడం మన బాధ్యత' అనే తత్వాన్ని ప్రతిపాదిస్తుంది. లాభం, వ్యక్తిగత ప్రయోజనం, గుర్తింపు లేకుండా జరిగే సేవే నిజమైన మహోన్నత సేవ. మన దేశంలో సామాజిక అసమానతలు, పేదరికం, విద్య మరియు ఆరోగ్య సమస్యలు ఇంకా ఉన్న నేపథ్యంలో, వాలంటీర్ల పాత్ర మరింత కీలకం. ప్రతి ఒక్కరూ "నేను ఏమి చేయగలను?" అని విచారించే రోజే మార్పు ప్రారంభమవుతుంది.

# డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం





మన గళండోన్ పట్టణంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నటువంటి నూతనంగా నిర్మించినటువంటి శ్రీ శ్రీ శ్రీ షిరిడి సాయిబాబా మందిరాన్ని ఈరోజు గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దర్శించుకోవడం జరిగింది. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయనకు తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా రావడానికి కోటి రూపాయలతో రూరల్ పోలీస్ స్టేషన్ సమీపం నుంచి బ్రిడ్జి నిర్మిస్తామని తెలిపారు. నేషనల్ హైవేపై వెళ్లే భక్తులు ఇక్కడ దర్శి దర్శించుకునే భాగ్యం కలిగిందని అన్నారు. జాతీయ రహదారిపై తరచుగా జరుగుతున్న ప్రమాదాలపై నేషనల్ హైవే అథారిటీ వారికి తెలుపుతామని మరియు పట్టణంలోని గెస్ట్ హౌస్ నందు నిర్మించినటువంటి డోంట్ డివిజనల్ అభివృద్ధి అధికారి డి డి ఓ కార్యాలన్నీ వర్చువల్ గా ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ముందుకు వెళుతుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, వ్యవసాయ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచడంలో ఈ కార్యాలయం చాలా కీలకంగా పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ ఎస్ డి సి చైర్మన్ ధర్మవరం మన్య సుబ్బారెడ్డి, చంద్రపల్లె నాగేశ్వరరావు యాదవ్, లక్క సాగరం లక్ష్మిరెడ్డి, ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలు, గ్రామ వార్డు సచివాలయ అధికారులు, ఉపాధి హామీ ఏపీవో సుకూర్, డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెలగల్ మండలాల్లోని పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం



మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం లో గూడూరు నందు గూడూరు ,బెలగల్ మండలాల్లోని పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం ప్రాంతీయ కమిటీ సభ్యుడు కే రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది,, సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ హాజరయ్యారు,, సమావేశంలో ప్రాంతీయ కార్యదర్శి జే, మోహన్, ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పార్టీ సభ్యుడు ఖాజా హుస్సేన్, మాధవ కృష్ణయ్య, మద్దిలేటి,, దానమన్న, మరియు గూడూరు, బెలగల్ పార్టీ సభ్యులు పాల్గొన్నారు,

# సిరుగుప్పలో వైభవంగా శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు.

( ఆలూరు మనగళం ): త్రిమూర్తుల (బ్రాహ్మ, విష్ణు, మహేశ్వరుల) స్వరూపంమై, ఆది గురువుగా పూజలు అందుకునే దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక రాష్ట్రం, సిరుగుప్ప పట్టణంలో 21వ వార్డులోని సదాశివ నగర్ కాలనీలో శ్రీ గౌరవయ్య గారి కుటుంబ సభ్యులు గురుబోధ తపోసకులు శ్రీదత్త వీరష్, శ్రీ దత్త ఉరుకుందమ్మ దంపతులు ఆధ్వర్యంలో శ్రీ దత్తత్రేయ 19వ ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గురుబోధన గురువులు నానేపటయ్య, మరియు బంధుమిత్రులు, కీ, శే,శకుంతలమ్మ కుటుంబ సభ్యులు వీరేష్, ఉరుకుందమ్మ, వెంకటేష్, నాగలక్ష్మి, ఈరన్న, హేమావతి, ఈరమ్మ, ఓబులేసు, వీరేంద్ర, గోపాల్ రాజశేఖర్, బంగారు హనుమంతప్ప, చంద్రమ్మ, హనుమన్న, నారాయణమ్మ, ఆలూరు ఈశ్వర్, నాగవేణి, ఆలూరు వీరేష్, పార్వతి, గోవిందమ్మ, రఘు, మంజమ్మ, అంజి, సుమన్, సునీత, వరలక్ష్మి, రామకృష్ణ, వరలక్ష్మి మధు, మహేంద్ర, జానకి, తదితరులు పాల్గొన్నారు.







# ఆలూరులో అంగరంగ వైభవంగా శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు.



( ఆలూరు మనగళం ): కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గంలో స్థానికంగా వెలిసిన శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు డిసెంబర్ 26వ తేది నుండి 4వ తేది వరకు భక్తిశ్రద్దలతో నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు తెలిపారు. శ్రీ దత్తాత్రేయ జయంతి పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమంలో కీ, శే, శ్రీ ఈశ్వర హరినాథ్ బాబు గురువు గారి ఆశీస్సులతో ఎంతో భక్తిశ్రద్దలతో నిర్వహిస్తారు. శ్రీ దత్తాత్రేయ జయంతి పూజ కార్యక్రమాలలో భాగంగా శ్రీ దత్తాత్రేయ స్వామి మరియు సాయిబాబా వారికీ అభిషేకం, గురు చరిత్ర మరియు సాయిబాబా సచ్చరిత్ర పారాయణం, గణపతి పూజ, నవగ్రహ శాంతి పూజలు నిర్వహించారు. శ్రీ సాయిరాం వారికీ రాజతాం నిర్వహించారు. విశేష పూజ కార్యక్రమాలలో భక్తులు, మరియు పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేశారు. అనంతరం తీర్థప్రసాదలు పూచ్చుకొని, అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎర్రిస్వామి, మరియు కమిటీ సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలందించడమే లక్ష్యం

**- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మనగళం, నంద్యాల: అభివృద్ధి శాఖలను డివిజనల్ స్థాయిలో తీసుకొచ్చి ప్రజలకు త్వరితగతిన సేవలందించడమే లక్ష్యంగా డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను ప్రభుత్వం తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని రైతు నగర్ లో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ అభివృద్ధి శాఖలను డివిజనల్ స్థాయిలో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనా పరిధిలోకి తీసుకురావడం వలన సేవల అందుబాటు పెరగడమే కాకుండా గ్రామీణాభివృద్ధికి వేగం చేరుతుందన్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు, మెరుగైన పర్యవేక్షణ, పారదర్శకత పెరుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఈ కార్యాలయం ద్వారా మిషన్ విభాగాల మధ్య సమన్వయం బలోపేతం కావడంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా అమలు కావచ్చని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ మార్కెట్



ముంబై , డిసెంబర్ 4 ,, మనగళం : గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రయాణించి చివరికి స్వల్ప లాభాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి వస్తున్న మిశ్రమ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి రికార్డు పతనంఈ మూడు అంశాల ప్రభావంతో మార్కెట్లు ఉదయం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అయితే మధ్య మధ్యలో కనిపించిన కొనుగోళ్లతో సూచీలు పాజిటివ్ వైపుకు కదలగా, అమ్మకాల ఒత్తిడితో మళ్లీ ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో బలమైన కొనుగోళ్లు రావడంతో సూచీలు స్వల్ప లాభాలను సాధించగలిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 84,949.98 పాయింట్ల కనిష్ఠానికి జారిపోగా, మధ్యాహ్నం తర్వాత 85,487.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరికి 158.51 పాయింట్లు పెరిగి 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 47.75 పాయింట్లు పెరిగి 26,033.75 వద్ద స్థిరపడింది. మొత్తం మార్కెట్ చిత్రాన్ని పరిశీలిస్తే 1,716 షేర్లు లాభపడగా, 2,237 షేర్లు నష్టాల్లో ముగియడం సూచీల్లో ఉన్న అస్థిరతను స్పష్టం చేసింది. నిఫ్టీ ప్రధాన గెయినర్లలో టీసీఎస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, భారత్ ఎలక్ట్రికల్స్, ట్రెంట్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి. మరోవైపు మారుతి సుజుకీ, ఎటర్నల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టాటా స్టీల్ వంటి షేర్ల ఒత్తిడిలో ట్రేడై నష్టాల్లో ముగిశాయి. మొత్తంగా చూస్తే, ప్రపంచ మార్కెట్ల అనిశ్చితి మధ్య దేశీయంగా కొనుగోలు%–%అమ్మకాల మధ్య సాగిన పోరులో చివరికి కొనుగోళ్లు పైచేయి సాధించడంతో సూచీలు స్వల్ప లాభాలను నమోదు చేశాయి. మార్కెట్లలో అస్థిరత కొనసాగుతున్నప్పటికీ పెట్టుబడిదారులు కీలక డేటా రాబోయే వరకు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఇండిగో సేవల్లో అంతరాయం





హైదరాబాద్, డిసెంబరు 4 ,మనగళం :: దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఇటీవలి రోజుల్లో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సాధారణంగా సమయపాలన, సేవల నాణ్యతకు పేరుగాంచిన ఈ సంస్థలో ఒక్కసారిగా ఏర్పడ్డ సిబ్బంది కొరత, సాంకేతిక లోపాలు, ఎయిర్‌పోర్టుల్లో పెరిగిన రద్దీ వంటి అంశాలు విమాన సేవలను గణనీయంగా దెబ్బతీశాయి. దీంతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు భారీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇండిగోలో ఏర్పడిన ఈ పరిస్థితి గత రెండు రోజులుగా మరింత ఆందోళన కలిగిస్తోంది. సంస్థ వరుసగా సుమారు 250 నుంచి 300 విమానాలను రద్దు చేయడం, వేలాదిమంది ప్రయాణికులను విమానాశ్రయాల్లోనే నిలదొక్కుకునేలా చేసింది. టైమ్‌స్లాట్లు మారడం, అకస్మాత్తుగా విమానాలు నిలిపివేయడం వంటి పరిణామాల కారణంగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ నెలలోనే మొత్తం 1,232 సర్వీసులను రద్దు చేశారని డీజీసీఏ అధికారికంగా ప్రకటించడంతో ఈ సంక్షోభం ఎంత లోతుగా వెళ్లిందో స్పష్టమైంది.

ఇదే నేపథ్యంలో స్టాక్‌మార్కెట్‌లోనూ ఇండిగోకు భారీ దెబ్బ తగిలింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు వరుసగా రెండో రోజు గణనీయ పతనాన్ని నమోదు చేశాయి. నేడు ఎన్‌ఎస్‌ఈలో ఒక్కో షేర్ రూ.5,405కి పడిపోవడం, పెట్టుబడిదారులలో అనిశ్చితి పెరుగుతోందనడానికి నిదర్శనం. గత ఐదు రోజుల్లో ఇండిగో స్టాక్ విలువ మొత్తం 6 శాతం పతనం కావడం కూడా ఆందోళన కలిగించే అంశమే.

ఇక సమస్యల తీవ్రత ఇక్కడితో ఆగలేదు. దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాల్లో ప్రయాణికులు రాత్రంతా అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నారులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు ముఖ్యంగా ఇబ్బంది పడ్డారు. ప్రత్యామ్నాయ విమానాలైనా ఎప్పుడు అందుబాటులో ఉంటాయో తెలియక ప్రజలు ఆగ్రహంతో విమానాశ్రయాల్లోనే నిరసన వ్యక్తం చేశారు. టికెట్ ధరల రీఫండ్‌లోనూ ఆలస్యాలు చోటుచేసుకుంటుండటంతో అనేక ఫిర్యాదులు డీజీసీఏ వద్దకు చేరాయి. సర్వీసుల్లోకి తిరిగి స్థిరత్వం తీసుకురావడానికి ఇండిగో యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, అందుకు సమయం కావాల్సి ఉంటుంది. సిబ్బంది నియామకాలు, అదనపు సాంకేతిక బృందాల నియామకం, సేవల సమన్వయం వంటి చర్యలు చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే సమస్య పెద్ద స్థాయిలో ఉన్నందున పరిష్కారం తక్షణమే లభించడం కష్టమని విమానయాన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇండస్ట్రీలో అగ్రగామిగా నిలిచిన ఇండిగో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనడం అరుదుగా కనిపించిన విషయం. ప్రయాణికులు నమ్మకాన్ని తిరిగి పొందడానికి సంస్థ త్వరితగతిన స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సేవల్లో స్థిరత్వం పునరుద్ధరించకపోతే, ఈ సంక్షోభం మరింతగా ఆర్థిక మరియు ప్రతిష్ఠాపర నష్టాన్ని కలిగించే అవకాశముంది.

# టెక్ లే ఆఫ్స్‌కు ఏఐ కారణం కాదు




న్యూయార్క్ , డిసెంబర్ 4 ,మనగళం : ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను పెద్ద ఎత్తున తొలగిస్తున్న తరుణంలో, ఈ లే ఆఫ్స్‌కు కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అని వాదనలు గట్టిగానే వినిపిస్తున్నాయి. అయితే ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ ఈ అభిప్రాయాన్ని ఖండించారు. ప్రస్తుతం జరుగుతున్న తొలగింపులకు ఏఐ అసలు కారణం కాదని, కోవిడ్ మైదానంలో కంపెనీలు చేసిన అతివేగపు నియామకాలే ఈరోజు లే ఆఫ్స్‌కు ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. 'ది వెర్జ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ, మహమ్మారి సమయంలో అనేక టెక్ సంస్థలు తమ సిబ్బందిని 30 నుంచి 100 శాతం వరకు పెంచుకున్నాయని, ఆ సమయంలో వచ్చిన అవసరాలు తగ్గిన తర్వాత ఇప్పుడు సర్దుబాట్లు జరగడం సహజమని తెలిపారు. పరిశ్రమ ఒక దశలో వేగంగా పెరిగితే, తర్వాత సంతులనం కోసం ఆ సంస్థలు తగ్గింపులు చేయాల్సి వస్తుందని ఆయన వివరించారు. ఈ ఏడాది ప్రారంభంలోనే ఐబీఎం సుమారు 2700 మంది ఉద్యోగులను తగ్గించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ చర్యను సాధారణ వ్యాపార సర్దుబాటు ప్రక్రియలో భాగంగా చూడాలని కంపెనీ స్పష్టం చేసింది. అరవింద్ కృష్ణ ఏఐ ప్రభావంపై మాట్లాడుతూ, రాబోయే సంవత్సరాల్లో పది శాతం మంది ఉద్యోగాలు కోల్పోవచ్చు కానీ అదే సమయంలో కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడతాయని పేర్కొన్నారు. ఏఐతో ఉత్పాదకత పెరిగినప్పుడు కంపెనీలు మళ్లీ నియామకాలను పెంచుతాయని చెప్పారు. ప్రాథమిక స్థాయి పనులను ఏఐ త్వరలో పూర్తిగా చేపట్టగలదని, కానీ వ్యూహాత్మకత, సృజనాత్మకత, మానవ అర్థం చేసుకునే సామర్థ్యం అవసరమైన పనులు మాత్రం పూర్తిగా మనుషుల చేతుల మీదే ఆధారపడుతాయని అన్నారు. ఏఐ పేరుతో ఎంట్రీ లెవల్ నియామకాలను తగ్గిస్తున్న టెక్ కంపెనీలను ఆయన విమర్శిస్తూ, "కొత్త యువ ఉద్యోగులు లేకపోతే రేపటి టెక్నాలజీని ఎవరు సృష్టిస్తారు?" అని ప్రశ్నించారు.

క్యాంపస్ నియామకాలను పెంచనున్నట్లు స్పష్టం చేసిన ఐబీఎం, రాబోయే ఏడాదిలో గత సంవత్సరాల కంటే మరింత మంది కొత్త గ్రాడ్యుయేట్స్‌ను నియమించుకుంటామని అరవింద్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంలో ఇతర టెక్ సంస్థలు నియామకాలను నిలిపివేస్తున్నా, ఐబీఎం మాత్రం దానికి విరుద్ధ దిశగా ముందుకు వెళ్తుందని ఆయన తేల్చిచెప్పారు.

# అల్‌టైమ్ కనిష్టానికి రూపాయి విలువ



హైదరాబాద్, డిసెంబరు 4 ,మనగళం :: రూపాయి మారకం విలువ రోజురోజుకూ క్షీణిస్తూ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా కరెన్సీకి పెరుగుతున్న డిమాండ్ రూపాయి పతనాన్ని మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే 90.15కు పడిపోయిన విలువ, గురువారం మరో 28 పైసలు జారి 90.43ను తాకింది. సమీప కాలంలో రూపాయి విలువ 90.70 నుంచి 91 వరకు సాగటానికి అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

బుధవారం ఉదయం 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి–డాలర్ రేటు, అంతటా ఒత్తిడిని ఎదుర్కొంటూ 90.30 వరకు దిగజారింది. విదేశీ దిగుమతిదారులు డాలర్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం, విదేశీ పెట్టుబడిదారులు భారీగా షేర్లు విక్రయించడం రూపాయి పడిపోవడానికి కారణమయ్యాయి. ఈ ఏడాది రూపాయి విలువ మొత్తం 5 శాతం తగ్గిపోవడం ఆందోళనకర అంశంగా మారింది.

అంతర్జాతీయ కరెన్సీలు అన్ని హెచ్చుతగ్గులతోనే ఉండటాన్ని ఎస్బీఐ ఆర్థిక శాఖ గుర్తిస్తూ, రూపాయి బలహీనతను అతిగా అర్థం చేసుకోవద్దని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా వడ్డీరేట్ల తగ్గింపుపై రిజర్వ్ బ్యాంక్ ఈ వారం తీసుకోనున్న నిర్ణయం రూపాయి పతన వేగాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. డాలర్–రూపాయి రేటు త్వరలోనే 89.90 నుంచి 91.20 మధ్య ఊగిసలాడవచ్చని అంచనా వేస్తున్నారు. రూపాయి విలువ తగ్గిపోవడంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పెరిగింది. ముఖ్యంగా దిగుమతులు పెరిగే అవకాశం ఉండటం చమురు, ఎలక్ట్రానిక్స్, యంత్రాంగం వంటి వస్తువుల ధరలను పెంచుతుంది. దేశీయ వినియోగంలో అధిక భాగం దిగుమతులపైనే ఆధారపడినందున ఇది పెద్ద భారంగా మారనుంది.

విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు రూపాయి పతనంతో తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. రూపాయి బలహీనపడుతున్నకొద్దీ వారికి నెలవారీ ఖర్చులు అమాంతం పెరుగుతున్నాయి. న్యూయార్క్ యూనివర్సిటీలో చదువుతున్న సంజనా కుమార్ చెప్పినట్లు గత ఏడాది 1500 డాలర్లకు రూ.1.25 లక్షలు ఖర్చవుతుండగా, ఇప్పుడు అదే మొత్తానికి మరో పది వేల రూపాయలు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. రూపాయి పతనం కొనసాగితే విద్య, చికిత్స, దిగుమతి అవసరాలన్నింటిపై భారమే పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అడ్వాన్స్ ఆదాయపు పన్ను గడువు సమీపంలో ఎవరు చెల్లించాలి? ఎలా లెక్కించాలి?




హైదరాబాద్, డిసెంబరు 4 ,మనగళం :: ఆదాయపు పన్ను చెల్లింపుల్లో ముందస్తు పన్ను ఒక కీలక అంశం. ఏడాదికి నాలుగు దఫాలుగా చెల్లించాల్సిన అడ్వాన్స్ పన్నులో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చెందిన మూడో దఫా గడువు డిసెంబరు 15 దగ్గరపడింది. ఈ తేదీని మిస్ చేస్తే వడ్డీలు, జరిమానాలు తప్పవని పన్ను నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు పన్ను ఎవరు చెల్లించాలి? ఎలా లెక్కించాలి? ఎవరికి మినహాయింపు? అనే వివరాలు ఇలా ఉన్నాయి.

కట్టాల్సిన మొత్తంలో టిడిఎస్ తగ్గించిన తర్వాత రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ పన్ను రావాల్సి ఉంటే అడ్వాన్స్ పన్ను తప్పనిసరి. జీతభత్యాలున్న వారైనా, జీతం తప్ప ఇతర ఆదాయాలుఇంటి అద్దె, వడ్డీ, ఫ్రీలాన్స్, పెట్టుబడుల లాభాలు ఉంటే ఆ భాగంపై ముందస్తుగా పన్ను చెల్లించాలి. వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపారులు, డాక్టర్లు, న్యాయవాదులు, కన్సల్టెంట్లు, చిన్న వ్యాపారాలు, షేర్లు%–%మ్యూచువల్ ఫండ్స్%–%ఎఫ్అండ్ఓ%–%డెట్ ఇన్స్ట్రుమెంట్స్%–%క్రిప్టో వంటి విభాగాల నుండి ఆదాయం పొందేవారందరికీ ఇది వర్తిస్తుంది.

మొత్తం పన్ను రూ.10,000 కంటే తక్కువగా ఉంటే ముందస్తు పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. అలాగే 60 ఏళ్లకు పైబడిన నివాసితులు (వ్యాపారం లేదా వృత్తి ఆదాయం లేనప్పుడు) ముందస్తు పన్ను నుండి విముక్తి పొందుతారు. మొత్తం ఆదాయం టిడిఎస్ ద్వారానే కవర్ అయితే కూడా ముందస్తుగా చెల్లించాల్సిన అవసరం ఉండదు.

పన్ను లెక్కించాలంటే ముందుగా వార్షిక ఆదాయాన్ని అంచనా వేసి, అర్హత కలిగిన మినహాయింపులు తగ్గించాలి. స్లాబ్ రేట్లను వర్తింపజేసి మొత్తం పన్ను లెక్కించి, ఇంతవరకు కట్టిన టిడిఎస్‌ను తీసివేయాలి. మిగిలిన మొత్తం రూ.10,000 దాటితే ముందస్తు పన్ను చెల్లించాలి. ఈ చెల్లింపును ఆదాయపు పన్ను విభాగం ఈ–పోర్టల్‌లో చలాన్ 280 ద్వారా ఆన్‌లైన్‌లో చేయవచ్చు.

గడువు దాటితే సెక్షన్ల 234బి, 234సి ప్రకారం నెలకు 1 శాతం వడ్డీ పడుతుంది. జీతం తప్ప ఇతర ఆదాయాలను సక్రమంగా ప్రకటించకపోతే జరిమానాలు కూడా విధించే అవకాశం ఉంది. అందుకే ప్రతి త్రైమాసికం లెక్కలు వేసుకుని ముందస్తుగా చెల్లించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అడ్వాన్స్ పన్ను దఫాలు ఇలా ఉంటాయిజూన్ 15కు 15 శాతం, సెప్టెంబరు 15కు మొత్తం 45 శాతం, డిసెంబరు 15కు మొత్తం 75 శాతం, మార్చి 15కు మొత్తంగా 100 శాతం చెల్లించాలి. డిసెంబరు 15 నాటికి అవసరమైన మొత్తాన్ని చెల్లించకపోతే వడ్డీలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# బ్లింకిట్ కొత్త సౌకర్యం..

హైదరాబాద్, డిసెంబర్ 4: ,మనగళం :క్విక్ డెలివరీ సేవలలో వేగంగా ముందంజలో ఉన్న బ్లింకిట్ వినియోగదారులకు మరింత సౌకర్యం కల్పిస్తూ నూతన మార్పును అమలు చేసింది. ఇంట్లో అవసరమైన సామాన్లు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసే సమయంలో చాలాసార్లు ఒకటి రెండు వస్తువులు మర్చిపోయే పరిస్థితి ఎదురవుతుంది. ఒకసారి ఆర్డర్ నమోదైన తర్వాత ఆ మర్చిపోయిన వస్తువులను తీసుకోవాలంటే మరోసారి కొత్తగా ఆర్డర్ చేయాల్సిందే. ఈ అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్డర్ సమర్పించిన తరువాత కూడా అవసరమైన వస్తువులను అదే ఆర్డర్‌లో చేర్చుకునే ఏర్పాటును బ్లింకిట్ అందుబాటులోకి తెచ్చింది.

సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అల్బీందర్ దిండ్సా వెల్లడించిన వివరాల ప్రకారం, ఆర్డర్ ప్యాకింగ్ పూర్తికాకముందు వినియోగదారులు మరిన్ని వస్తువులను చేర్చుకోవచ్చు. ఇందుకోసం అదనంగా ఎలాంటి డెలివరీ రుసుములు ఉండవు. వినియోగదారుల అభ్యర్థన మేరకు తీసుకొచ్చిన ఈ సౌకర్యం గృహ వినియోగదారులకు మరింత మేలు చేయనుంది. అవసరం గుర్తొచ్చిన ప్రతి సారి కొత్త ఆర్డర్ పెట్టే ఇబ్బంది తప్పి, ఒకే ఆర్డర్‌లో అవసరమైన అన్ని వస్తువులు పొందే వీలు కలగనుంది. దేశంలోని పలు మహానగరాల్లో బ్లింకిట్ సేవలు విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. వేగవంతమైన డెలివరీ, సులభమైన వినియోగం వంటి అంశాల వల్ల విస్తృత ఆదరణ పొందిన ఈ సంస్థ ఇటీవల చిన్న పిల్లలు వాడే ఖాతాలకు పరిమితులుగా పేరెంటల్ నియంత్రణలను కూడా ప్రవేశపెట్టింది. తాజా సౌకర్యం వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తీసుకొచ్చిన మరో కీలక అడుగుగా నిలిచింది.

మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక




# కార్తి కొత్త చిత్రం విడుదలకు బ్రేక్

చెన్నై , డిసెంబర్ 4 , మనగళం : తమిళ స్టార్ హీరో కార్తి నటించిన తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ వా వాతియార్ తెలుగు టైటిల్ అన్నగారు వస్తారు విడుదలకు ముందే పెద్ద షాక్ తగిలింది. డిసెంబర్ 12న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఈ చిత్రంపై మద్రాస్ హైకోర్టు మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు జారీ చేయడంతో మూవీ విడుదల తాత్కాలికంగా వాయిదా పడినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ఈ వివాదానికి కారణం నిర్మాత జ్ఞానవేల్‌రాజా %–% ఫైనాన్షియర్ అర్జున్‌లాల్ మధ్య నెలకొన్న ఆర్థిక సమస్యలేనని తెలుస్తోంది. నిర్మాత చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటి వరకు తీర్చలేదని అర్జున్‌లాల్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం పిటిషన్‌ను విచారించిన కోర్టు, తదుపరి విచారణ వరకు చిత్ర విడుదలను నిలిపివేయాలని ఆదేశిస్తూ మధ్యంతర స్టే విధించింది. ఈ నిర్ణయంతో ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం విడుదల సస్పెన్స్‌లో పడింది.

నలన్ కుమారస్వామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం కార్తిని పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా చూపించనుంది. యాక్షన్‌తో నిండిన ఈ సినిమాకు కృతి శెట్టి కథానాయికగా నటించింది. తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులు కూడా అన్నగారు వస్తారు చిత్రాన్ని పెద్ద ఎత్తున ఎదురుచూస్తున్నారు. ట్రైలర్లు, పోస్టర్లు మంచి హైప్ క్రియేట్ చేసిన నేపథ్యంలో విడుదల వాయిదా పడటం అభిమానులకు నిరాశ కలిగించింది. ఇక నిర్మాత – ఫైనాన్షియర్ వివాదం ఎంత త్వరగా పరిష్కారం అవుతుందనే ప్రశ్నే ఇప్పుడు పెద్దదిగా మారింది. హైకోర్టు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సినిమా రిలీజ్ పాస్‌లో ఉండటంతో, కొత్త రిలీజ్ తేదీపై స్పష్టత రానుందో లేదో అనేది ఇంకా తెలియలేదు.

# జపాన్ ప్రయాణానికి సిద్ధమైన ప్రభాస్...



హైదరాబాద్ ,డిసెంబర్ 4 , మనగళం : బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బిజీగా ఉన్న గ్లోబల్ స్టార్ ప్రభాస్ ఈసారి తన అభిమానులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు స్పిరిట్ షూట్‌కు చిన్న విరామం ఇచ్చాడు. ఆయన ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో జరగనున్న బాహుబలి : ది ఎపిక్ ప్రత్యేక ప్రీమియర్‌లో పాల్గొనడానికి గురువారం జపాన్‌కు బయలుదేరాడు. ప్రభాస్‌తో పాటు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుండడంతో, మేకర్స్ డిసెంబర్ 5, 6 తేదీల్లో ప్రత్యేక ప్రీమియర్లను ఏర్పాటు చేశారు. కల్కి 2898 ఏడీ ప్రమోషన్ల సమయంలో జపాన్ అభిమానులను ప్రత్యక్షంగా కలుసుకోలేకపోయిన ప్రభాస్, “తప్పకుండా వస్తాను” అని అప్పట్లో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మాట నిలబెట్టుకుంటూ రేపు అభిమానులతో ప్రత్యేక చిట్‌చాట్ సెషన్‌లో పాల్గొననున్నాడు. జపాన్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ కార్యక్రమాలకు భారీ రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా స్పిరిట్ చిత్రం షూటింగ్ ఇప్పటికే మొదలై, ప్రభాస్ తృప్తి డిమ్రిపై కొన్ని కీలక సన్నివేశాలు ఇటీవలే చిత్రీకరించారు. అయితే జపాన్ పర్యటన కారణంగా షూట్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. టూర్ ముగిసిన వెంటనే ప్రభాస్ మళ్లీ సెట్స్‌పైకి వెళ్లి స్పిరిట్ షూటింగ్‌ను వేగంగా పూర్తి చేయనున్నాడు. మరోవైపు టాలీవుడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ జోనర్‌లో రూపొందుతున్న రాజాసాబ్ 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రభాస్ ఇప్పుడు జపాన్ పర్యటనతో తన గ్లోబల్ స్థాయిని మరోసారి చాటుకోనున్నాడు.




# తెలంగాణలో ‘అఖండ 2’కి ప్రత్యేక అనుమతులు



హైదరాబాద్ , డిసెంబర్ 4 , మనగళం ;: నటసింహం నందమూరి బాలకృష్ణ %–% మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన అఖండ 2 విడుదలకు ముందుగానే భారీ హైప్ క్రియేట్ అవుతున్న సమయంలో, తెలంగాణ ప్రభుత్వం ఈ చిత్రానికి ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సంబంధించి టికెట్ ధరలను పెంచేందుకు అధికారికంగా అనుమతి లభించింది.

తాజాగా వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై జీఎస్టీతో కలిపి అదనంగా రూ.50ను, మల్టీప్లెక్స్‌లలో జీఎస్టీతో పాటు అదనంగా రూ.100ను వసూలు చేసుకునే అవకాశం నిర్మాతలకు కల్పించారు. భారీ యాక్షన్, ఫుల్ మాస్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం కోసం ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బాలకృష్ణ అభిమానుల కోసం ప్రత్యేక ప్రీమియర్ షోకు కూడా తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 8 గంటలకు ప్రత్యేక ప్రీమియర్ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, ఆ ప్రీమియర్ టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.600గా నిర్ణయించింది. బాలయ్య అభిమానుల్లో ఈ నిర్ణయం భారీ ఉత్సాహాన్ని రేకెత్తించింది. పెంచిన టికెట్ ధరలు సినిమా విడుదలైన మొదటి మూడు రోజులపాటు మాత్రమే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విడుదలైన తర్వాత క్రమంగా టికెట్ ధరలు యధాస్థితికి వస్తాయి. ఇప్పటికే అఖండ 2 ట్రైలర్‌కు వచ్చిన స్పందన, బాలయ్య – బోయపాటి కాంబినేషన్‌పై ఉన్న ప్రత్యేక క్రేజ్ దృష్ట్యా, ఈ చిత్రం తొలి వారం భారీ కలెక్షన్లు సాధించే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఇళయరాజా పాటల వివాదం పరిష్కారం



హైదరాబాద్ , డిసెంబర్ 4 , మనగళం : మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న చిత్రాల్లో ఇళయరాజా సంగీత వినియోగం అంశంపై గత కొన్ని రోజులుగా సాగుతున్న వివాదం ఎట్టకేలకు సద్దుమణిగినట్లు సమాచారం. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పాటలను అనుమతి లేకుండా ఉపయోగించారన్న ఆరోపణలతో ఈ వివాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. అయితే తాజా నివేదికల ప్రకారం రెండు పక్షాలు పరస్పర అంగీకారానికి వచ్చి సమస్యను సాఫీగా పరిష్కరించినట్లు తెలుస్తోంది.

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ఉన్న డ్యూడ్, గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రాల్లో ఇళయరాజా సంగీతం వాడినందుకు గాను సంస్థ రూ.50 లక్షలు చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ చెల్లింపుతో ఆ రెండు చిత్రాల్లో ఇళయరాజా పాటలను అధికారికంగా ఉపయోగించేందుకు కచ్చితమైన హక్కులు మైత్రీ మూవీ మేకర్స్‌కు లభించినట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదివరకు అనధికారిక వినియోగం జరిగిందనే ఆరోపణలు రావడంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది.

ఇళయరాజా సంగీతం అంటే అభిమానుల్లో, ముఖ్యంగా సౌతిండియన్ సినీ ప్రేక్షకులలో ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని, మైత్రీ మూవీ మేకర్స్ ఈ వ్యవహారాన్ని చట్టబద్ధంగా పరిష్కరించుకోవడమే మంచిదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య జరిగిన చర్చలు, న్యాయపరమైన సూచనల అనంతరం ఈ ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

అయితే ఈ మొత్తం వ్యవహారంపై మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. త్వరలోనే ఒక స్పష్టమైన స్టేట్‌మెంట్ ఇవ్వనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వివాదం ముగియడంతో డ్యూడ్, గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రాల పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగనున్నాయి. ఇళయరాజా పాటలకు కలిగిన ప్రత్యేక స్థానాన్ని గౌరవించడంతో పాటు, చిత్ర నిర్మాణ సంస్థ తమ హక్కులను చట్టబద్ధంగా నిలబెట్టుకోవడం ద్వారా ఈ విషయానికి ముగింపు లభించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# పెళ్లి రూమర్లపై స్పందించిన రష్మిక



హైదరాబాద్ ,డిసెంబర్ 4 , మనగళం : టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా విజయ్ దేవరకొండ రష్మిక మందన్న పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. వచ్చే ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వివాహం జరిగే అవకాశముందన్న ప్రచారం తీవ్రంగా నడుస్తోంది. రష్మిక అక్కడి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిందన్న వార్తలు బయటకు రావడంతో ఈ రూమర్లు మరింత బలం దొరికాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరి తరఫునా ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు. ఇలాంటి పరిస్థితిలో హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక ఈ వివాహ రూమర్లపై మొదటిసారి స్పందించింది. రూమర్లను పూర్తిగా ఖండించలేనని, అలాగే ధ్రువీకరించలేనని చెప్పిన ఆమె “నా పెళ్లి గురించి ఎప్పుడు మాట్లాడాలో, ఏ వివరాలు ఎప్పుడు బయటపెట్టాలో నాకు మాత్రమే తెలుసు. సరైన సమయం వచ్చినప్పుడు అందరికీ చెబుతాను” అని వ్యాఖ్యానించింది.

రష్మిక చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్%–%రష్మిక జంట ఇప్పటి వరకు ఎలాంటి ఎంగేజ్‌మెంట్ ఫోటోలు గానీ, ప్రకటనలు గానీ పెట్టకపోవడంతో, ఇద్దరూ ప్రత్యేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చ మొదలైంది. గీత గోవిందం, డియర్ కామ్రేడ్‌తో సూపర్ హిట్ జోడిగా నిలిచిన వీరిద్దరూ త్వరలో రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మరో చిత్రంలో కలిసి నటించనున్నారనేది తాజా టాక్. ఇక రష్మిక కెరీర్ ప్రస్తుతం టాప్ గేర్‌లో సాగుతోంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో వరుస విజయాలను అందుకుంటూ నేషనల్ క్రష్ నుంచి వరల్డ్ క్రష్‌గా ఎదుగుతోందని అభిమానులు చెబుతున్నారు. అయితే పెళ్లి తర్వాత ఆమె సినిమా ప్రయాణం ఎలా ఉండబోతుందో ఇప్పటికీ సస్పెన్స్‌గా ఉంది.

## టెస్టుల్లో కొత్త చరిత్ర రాసిన 'మిస్పైల్ స్టార్క్'



బ్రిస్బేన్ : డిసెంబర్ 4 , మన గళం :యాషెస్ పింక్‌బాల్ టెస్టులో మిచెల్ స్టార్క్ విజృంభణ కొత్త చరిత్రకు నాంది పలికింది. గబ్బా వేదికగా ఇంగ్లండ్ బ్యాటర్లపై మంటలు రేపిన ఈ ఆస్ట్రేలియా పేస్ గన్, సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎడమచేతి వేగగాళ్లలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను వరుస వికెట్లతో ఛేదిస్తూ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన స్టార్క్, ఐదో వికెట్ తీశాకే పాక్ దిగ్గజం వసీం అక్రమ్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 415 వికెట్లు చేరడం ఈ ఘనతకు నిదర్శనం. ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, 2011లో స్టార్క్ తన టెస్ట్ అరంగేట్రం చేసిన మైదానం ఇదే గబ్బా కావడం. అదే చోట సంవత్సరాల తర్వాత చరిత్ర సృష్టించడం అతడి కెరీర్‌కు మరింత ప్రత్యేకతను జతచేసింది. యాషెస్‌లో ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను వరుసగా ఛిద్రము చేస్తూ వస్తున్న స్టార్క్, వేగం మరియు స్వింగ్ కలయికతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పింక్‌బాల్‌తో అతడి ప్రభావం మరింత పెరిగి కనిపించడం ఆసీస్‌కి భారీ బలాన్ని ఇస్తోంది. ఈ రికార్డు కేవలం అక్రమ్‌ను దాటిన ఘనత మాత్రమే కాదు, ప్రపంచ క్రికెట్‌లో ఎడమచేతి పేసర్ల ప్రభావాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లిన ఫీట్‌గా నిలిచింది. స్టార్క్ తన కెరీర్‌లో ఇప్పటికే వన్డేల్లో కూడా మైలురాళ్లను చేరుకున్నాడు. గత సంవత్సరం పాకిస్థాన్‌పై జరిగిన మ్యాచ్‌లో కేవలం 54 ఇన్నింగ్స్‌ల్లోనే వన్డేల్లో 100 వికెట్ల క్లబ్‌లోకి ప్రవేశించి బ్రెట్ లీ రికార్డును అధిగమించాడు.తాజా టెస్ట్ రికార్డుతో స్టార్క్ ఇప్పుడు లెఫ్ట్ ఆర్మ్ పేసింగ్ చరిత్రలో అగ్రస్థానం దక్కించుకున్నాడు. యాషెస్ సిరీస్ కొనసాగుతున్న నేపథ్యంలో అతడి వికెట్ల వేట ఇక్కడితో ఆగేలా కనిపించడంలేదు. అతడి వేగం, బౌన్స్, రివర్స్ స్వింగ్ కలిపి ఇంగ్లండ్ బ్యాటర్లను ఇంకా ఎంతగా ఇబ్బంది పెడతాయో క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది.

## నిప్పులు చెరిగిన స్టార్క్... కానీ రూట్ రికార్డు





బ్రిస్బేన్ , డిసెంబర్ 4 , మన గళం :యాషెస్ తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్, గబ్బా టెస్టులో కూడా ప్రారంభంలో తడబడినా జో రూట్ ధైర్యవంతమైన శతకంతో నిలబడింది. మిచెల్ స్టార్క్ ఆరంభం నుంచే నిప్పులు చెరిగి ఇంగ్లండ్ టాపార్డర్‌ను ఛిద్రము చేసినప్పటికీ, రూట్ (135 నాటౌట్) ఒంటిచేత్తో ఇన్నింగ్స్‌ను నిలబెట్టి జట్టు స్కోర్‌ను 300 దాటించాడు. చివరి వికెట్ భాగస్వామ్యంతో ఇంగ్లండ్ తొలి రోజునే ఆలౌట్ ప్రమాదం నుంచి బయటపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోవడం పెద్ద షాక్‌గా మారింది. పెర్త్‌లో పదికి పది వికెట్లు తీసి స్టోక్స్ సేనను కుప్పకూల్చిన స్టార్క్, గబ్బాలో కూడా అదే గతి చూపించాడు. బెన్ డకెట్ (0), ఓలీ పోప్ (0)లను వరుసగా పెవిలియన్‌కు పంపి ఇంగ్లండ్‌ను గందరగోళంలో నెట్టాడు. ఈ సంక్షోభ సమయంలో క్రీజులోకి వచ్చిన రూట్, మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కగా నడిపించాడు. 181 బంతుల్లో శ్రమించి కంగారూ గడ్డపై తొలి శతకాన్ని నమోదు చేసిన రూట్, అదే సమయంలో తన టెస్ట్ కెరీర్‌లో 40వ సెంచరీని కూడా సాధించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతని క్లాస్, పట్టుదల మళ్లీ రుజువైంది. 264 పరుగుల వద్ద 9 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ మళ్లీ పతనం అంచున నిలిచిన సమయంలో, రూట్‌కు జోఫ్రా ఆర్చర్ (32 నాటౌట్) రూపంలో బలమైన తోడు లభించింది. చివరి వికెట్‌కు ఇద్దరూ కలిసి 61 పరుగులు జోడించడం విశేషం. ఆర్చర్ బౌలర్లను జాగ్రత్తగా ఎదుర్కొంటూ, రూట్‌కు కావాల్సిన మద్దతు అందించాడు. ఫలితంగా తొలి రోజు స్టంప్స్ సమయానికి ఇంగ్లండ్ 325/9తో నిలబడి పరాజయ ముప్పును తప్పించుకుంది. ఇదిలా ఉండగా, స్టార్క్ 6 వికెట్లు (6/71) తీసి మరోసారి తనదైన ఆధిపత్యాన్ని చాటాడు. గబ్బాలో ఐదో వికెట్ తీసిన క్షణం నుంచే పాక్ దిగ్గజం వసీం అక్రమ్ రికార్డును అధిగమించి టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అవతరించాడు. మొత్తంమీద రూట్ లాంటి పెద్ద ఇన్నింగ్స్ లేకపోయి ఉంటే ఇంగ్లండ్ పరిస్థితి మరింత దయనీయంగా మారేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ ఎక్కడ ముగుస్తుందో, ఆసీస్ ఎలా ప్రతిస్పందిస్తుందో అన్న దానిపై ఇప్పుడు ఆసక్తి కేంద్రీకృతమైంది.

---

## రో - కో భవిష్యత్తు 'వారి' చేతుల్లోనే..





న్యూఢిల్లీ , డిసెంబర్ 4 , మన గళం : భారత్‌కు ఎన్నో గౌరవాలు తెచ్చిన సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే ఫార్మాట్‌లో ఇంకా అదరగొడుతూనే ఉన్నప్పటికీ, 2027 వన్డే ప్రపంచకప్ బెర్తుపై మాత్రం సందిగ్ధత పెరుగుతూనే ఉంది. వరుస సెంచరీలతో, బెస్ట్ ఫార్మ్‌లో ఉన్నప్పటికీ రో%-%కో భవిష్యత్తు 'ఇద్దరి' చేతుల్లో ఉందన్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో మాజీ ఆఫ్‌స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ భారత క్రికెట్ మేనేజ్‌మెంట్‌పై నేరుగా ప్రశ్నలు లేవనెత్తాడు. హర్భజన్ మాట్లాడుతూ, కోహ్లీ%-%రోహిత్‌లను ఎవరు అవకాశమిస్తారు, ఎవరు తీసేస్తారు అన్న నిర్ణయం ప్రస్తుతం అంత క్రికెట్ సాధించని వ్యక్తుల చేతుల్లో ఉండటం అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించాడు. "మైదానంలో తమ విలువను బ్యాట్‌తో రుజువు చేస్తూనే ఉన్న ఇద్దరు ఛాంపియన్స్ క్రికెటర్ల భవిష్యత్తు, తమకున్న గొప్పతనమేంటి అన్న ప్రశ్న కూడా రాని వ్యక్తుల నిర్ణయాలపై ఆధారపడటం దురదృష్టకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల భారత జట్టులో విభేదాలు బహిర్గతమవుతున్నాయనే ప్రచారాలు బలపడుతుండగా, హెడ్ కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో సీనియర్ల విభేధాలే టెస్టు ఫార్మాట్ నుంచి రో - కో వైదొలగడానికి ప్రధాన కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీ20లకు గతేడాది వీడ్కోలు పలికిన రోహిత్ - కోహ్లీ, ఈ ఏడాది టెస్టులకు కూడా గుడ్‌బై చెప్పడంతో, ఇప్పుడు వన్డే ప్రపంచకప్ బెర్తు విషయంలో అస్పష్టత నెలకొంది. హర్భజన్ మాట్లాడుతూ, "నాకు కూడా నా కెరీర్‌లో ఇదే అన్యాయం ఎదురైంది. టాలెంట్ ఉన్నా, మంచి ఫార్మ్‌లో ఉన్నా, ఒకరి అభిప్రాయం వల్ల ఎంతమంది ఆటగాళ్ల కెరీర్ కోల్పోయారో తెలుసు. ఇప్పుడు అదే పరిస్థితి రోహిత్ - కోహ్లీ ఎదుర్కొంటున్నారు. వీరిద్దరూ భారత క్రికెట్‌లో అత్యంత గొప్పలు. ఇంకా రోజురోజుకు మెరుగుపడుతున్నారు. యువతరానికి ఆదర్శాలు" అని అన్నారు. రాంచీ వన్డేలో సెంచరీ తర్వాత కోహ్లీ చేసిన ఆగ్రెసివ్ సెలబ్రేషన్ కూడా ఈ నేపథ్యం మీదే జరిగినదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గంభీర్–అగార్కర్ నిర్ణయాలపై ఉన్న అసంతృప్తే ఆ సెలబ్రేషన్‌లో ప్రతిఫలించిందని అనేక మంది విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత క్రికెట్‌లో రో - కో లాంటి సీనియర్ ప్లేయర్ల భవిష్యత్తు ఇప్పుడే ప్రశ్నార్థకంగా మారిపోవడం అభిమానుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. 2027 వరల్డ్‌కప్ జట్టులో వీరి స్థానం ఏమవుతుందనేది ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశంగా మారింది.

## ఆస్ట్రేలియా గడ్డపై రూట్ తొలి శతకం



బ్రిస్బేన్ , డిసెంబర్ 4 , మన గళం :ఆస్ట్రేలియా నేలపై శతకం కొట్టాలన్న కలను ఎన్నో ఏళ్లుగా వెంట తీసుకుంటూ పరిగెత్తుతున్న ఇంగ్లండ్ స్టార్ జో రూట్ చివరకు తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు. గబ్బా వేదికగా జరుగుతున్న యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఆస్ట్రేలియా బౌలర్ల ఒత్తిడిని ఎదుర్కొంటూ ఈ స్టార్ బ్యాటర్ తన తొలి శతకాన్ని కంగారూ గడ్డపై సాధించాడు. పింక్ బాల్ టెస్టులో ఒత్తిడిలోనూ ధృడసంకల్పంతో ఆడి, 181 బంతుల్లో మూడంకెల స్కోర్ చేరుకుని జట్టును నిలబెట్టాడు. మ్యాచ్ ఆరంభంలోనే ఇంగ్లండ్ భారీ షాక్ ఎదుర్కొంది. మిచెల్ స్టార్క్ వేగానికి బెన్ డకెట్, ఓలీ పోప్‌లు మొదటి ఐదు పరుగులకే పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ నిలిచిపోవడం ఖాయమనే భావన కలిగింది. అయితే ఈ కఠిన తరుణంలో క్రీజులోకి వచ్చిన రూట్, మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)తో కలిసి కీలక భాగస్వామ్యం కట్టి జట్టుకు ఊపిరి పోశాడు. ఆ తరువాత కూడా ఆస్ట్రేలియా బౌలర్ల అట్టాక్స్ ఎదుర్కొంటూ సుస్థిరంగా ఆడి, ఎన్నో ప్రయత్నాల్లో చేజారిపోయిన ఆ మంచి ఇన్నింగ్స్‌ను ఈసారైనా పూర్తి చేశాడు. ఈ శతకానికి ముందు రూట్ ఆస్ట్రేలియాలో 27 ఇన్నింగ్స్‌లు ఆడినా ఒక్కటంటే ఒక్క శతకం నమోదు చేయలేకపోయాడు. మూడు సార్లు 80ల్లో ఔటవడం అతడిలో నిరాశను మిగిల్చినా, ఈ సారి మాత్రం ఆ గోడను దాటి ఆశించిన మైలురాయిని చేరుకున్నాడు. దీనితో అతడి ఆస్ట్రేలియా రికార్డులకు కొత్త పుట తెరుచుకుంది ఇదిలా ఉండగా యాషెస్ ఆల్‌టైమ్ జట్టులో రూట్ పేరు లేకపోవడంపై దిగ్గజ ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ హేడెన్ ఇటీవల పాడ్‌కాస్ట్‌లో మండిపడ్డాడు. రూట్‌ను పక్కనపెట్టడమే అవివేకమని, ఈ వేసవిలో రూట్ ఆస్ట్రేలియాపై సెంచరీ చేయకుంటే తాను ఎంసీజీలో నగ్నంగా నడుస్తానని చేసిన కామెంట్ అప్పట్లో చర్చనీయాంశమైంది. హేడెన్ కూతురు గ్రేస్ హ్యారిస్ కూడా దీనిపై ఫన్నీగా స్పందిస్తూ "ప్లీజ్ రూట్%ఔ% సెంచరీ కొట్టు" అంటూ చెప్పిన మాటలు ఇప్పుడు నిజం అయినట్టుగా అభిమానులు సోషల్ మీడియాలో పొగడ్తలు కురిపిస్తున్నారు. యాషెస్ సిరీస్ 2025%-%26 నవంబర్ నుంచి జనవరి వరకు జరగనున్న నేపథ్యంలో, కంగారూ గడ్డపై గత మూడు పర్యాయాలుగా పూర్తిగా ఓడిపోతూ వస్తున్న ఇంగ్లండ్ జట్టుకు రూట్ ఈ శతకం భారీ ఆత్మవిశ్వాసాన్ని అందించినట్టే. 2011 తర్వాత ఆస్ట్రేలియా నేలపై ఒక్క టెస్టూ గెలవకపోవడం ఇంగ్లండ్‌కు పెద్ద దెబ్బ అయ్యింది. ఈసారి ఆ రికార్డును చెరిపేయాలన్న పట్టుదలతో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బృందం ముందుకు సాగుతోంది. రూట్ సాధించిన ఈ శతకం ఇంగ్లండ్ ఆశలను మళ్లీ చిగురింపజేయడమే కాకుండా, యాషెస్‌లో పోరాటం మరింత రసవత్తరంగా మారబోతుందనే సంకేతాలు ఇస్తోంది.

## సిరాజ్,ను పక్కన పెట్టడంపై ఆకాశ్ చోప్రా ఆగ్రహం



రాయ్‌పూర్ , డిసెంబర్ 4, మన గళం : సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత బౌలర్లు వరుసగా విఫలమవుతుండటంతో టీమిండియా బౌలింగ్ యూనిట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను వన్డే జట్టులో ఎందుకు పక్కన పెడుతున్నారో అర్థం కావడం లేదంటూ మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తీవ్రంగా ప్రశ్నించాడు. బ్యాటింగ్ ఎంత బలంగా ఉన్నా, బౌలర్లు 330 పైగా పరుగులు ఇవ్వడం జట్టు అవకాశాలను పూర్తిగా దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

రెండో వన్డేలో భారత్ చేసిన 359 పరుగుల భారీ స్కోరు కూడా వృథా కావడం, కీలక సందర్భాల్లో వికెట్లు తీయడంలో బౌలర్ల వైఫల్యం స్పష్టంగా కనిపించడం ఆకాశ్ చోప్రా ఆగ్రహానికి కారణమైంది. సిరాజ్‌ను వన్డే ఫార్మాట్ నుంచి అనూహ్యంగా దూరం పెట్టడం సెలక్షన్ కమిటీ తీసుకుంటున్న నిర్ణయాలపై అనుమానాలు రేకెత్తిస్తోందని ఆయన వ్యాఖ్యానించాడు. తన ఎక్స్ పోస్టులో ఆకాశ్ చోప్రా, "సిరాజ్ ఒకే ఫార్మాట్ ప్లేయర్‌గా ఎప్పుడు మారిపోయాడు? అతడు ఆడిన ప్రతిసారి వికెట్లు తీసే బౌలర్. వన్డేల్లో అతడి పేరు ఏ దశలో కనుమరుగైంది? అతడు డొమెస్టిక్ క్రికెట్‌లో ఆడుతున్నాడు, ఫామ్ కూడా బాగానే ఉంది. అయినా అతడిని ఎంపిక చేయడం లేదు. ఇది అసలు ఎందుకు జరుగుతోంది?" అంటూ ప్రశ్నించాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడం తనను తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపాడు. ఇక ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాలాంటి యువ పేసర్లకు వరుసగా అవకాశాలు ఇవ్వడం సరిగానే ఉన్నా, సిరాజ్‌కు మాత్రం ఒకే ఛాన్స్ కూడా రాకపోవడం అన్యాయమని ఆకాశ్ అభిప్రాయపడ్డాడు. "ఈ యువ బౌలర్లకు చిరునవ్వులు, సిరాజ్‌కు మాత్రం తలుపులు మూసేస్తున్నారా? అతడిని సింగిల్ ఫార్మాట్ ప్లేయర్‌గా మార్చేసింది ఎవరు? మీకే తెలిసినట్లైతే నాకు చెప్పండి" అంటూ సెలక్షన్ కమిటీపై పరోక్షంగా దాడి చేశాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత భారత్ ఇప్పటివరకు 19 వన్డేలు ఆడగా, వాటిలో సిరాజ్ కేవలం ఆరు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. ముఖ్యంగా గత నెల ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లలో మంచి ప్రదర్శన కనబరిచినప్పటికీ, తర్వాత మరోసారి పక్కన పెట్టడం అభిమానుల్లో కూడా అసంతృప్తిని పెంచింది. ఓవరాల్‌గా తన వన్డే కెరీర్‌లో 46 మ్యాచ్‌ల్లో 73 వికెట్లు పడగొట్టిన సిరాజ్ ప్రస్తుతం టెస్టుల్లో మాత్రమే నిరంతరంగా ఆడుతున్నాడు. బౌలర్ల వైఫల్యం కారణంగా రెండో వన్డేలో ఓటమిపాలయిన టీమిండియా, మూడో వన్డేలో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిరాజ్‌లాంటి వికెట్ టేకర్‌ను దూరం పెట్టడం జట్టుకు నష్టం చేస్తున్నదన్న చర్చ ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.